క్లుప్తంగా

సాధన మండలిలో ఆధ్యాత్మిక ప్రవచనం



భట్టిప్రోలు: పుట్టుట, ఉండుట, పెరుగుట, పరిణామం చెందడం, క్షీణించడం, నశించటం ఈ ఆరింటినీ షడ్భావ వికారాలంటారని రిటైర్డ్ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ రఘుచంద్ర దాసు (కేఎస్ రావు) పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం 50వ వార్షికోత్సవం, గీతా జయంతి మహోత్సవాలు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో రఘుచంద్ర దాసు మాట్లాడుతూ ముందు లేక తరువాత కలుగుట జన్మమని, ఉండి లేక పోవుట మరణమని తెలిపారు. తొలుత శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహానికి పాదుకలకు అభిషేకాలు, జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మకు అష్టోత్తర శతనామాలతో పూజ, శ్రీమద్భగద్గీతా పారాయణ శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులకు పి.మల్లిఖార్జునరావు, పి.అక్కేశ్వర ప్రసాద్, జి.మల్లిఖార్జునరావులు ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమాలను సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్



బాపట్లటౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. మజుందార్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంపై కేంద్రం ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. దేశంలో అక్షరాస్యత వంద శాతం సాధించిన రాష్ట్రంగా కేరళ ఉందన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం ప్రజలకు కనీస సౌకర్యాలు, వేతనాలు అమలు చేయడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేరళకు రావాల్సిన నిధులను సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని, అప్పులు తెచ్చుకోవడానికి కూడా ఆంక్షలు విధిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సహకార వ్యవస్థను దెబ్బతీయడానికే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సురేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ గంగయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు భాస్కరరావు, శరత్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణవేణి, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ కొండయ్య, టైం స్కేల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి శామ్యూల్ పాల్గొన్నారు.

ఆంధ్ర భాషోద్ధారకులు బ్రౌన్ సేవలు విశేషమైనవి



బాపట్ల: తొలి తెలుగు నిఘంటువును, వ్యాకరణాన్ని ప్రచురించి తెలుగు భాషకు గుర్తింపు తెచ్చిన ఆంధ్ర భాషోద్ధారకులు సి.పి.బ్రౌన్‌ను ఎం.మాల్యాద్రిరావు కొనియాడారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో బాపట్ల జమేదారుపేటలోని కార్యాలయంలో గురువారం సి.పి.బ్రౌన్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో సాహితీ భారతి ఉపాధ్యక్షులు ఎం.మాల్యాద్రిరావు మాట్లాడుతూ బ్రౌన్ శిథిలావస్థలో ఉన్న తాళపత్ర గ్రంథాలను వెలికి తీసి వాటిని ప్రచురించి తెలుగు సాహిత్యానికి పునః ప్రాణ ప్రతిష్ట చేశారని గుర్తు చేసుకున్నారు. నలచరిత్ర, ఆంధ్ర మహాభారతం, శ్రీమద్ భాగవతం, వసు చరిత్ర వంటి గ్రంథాలను ప్రచురించారని తెలిపారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ మాట్లాడుతూ బ్రౌన్ తెలుగు–ఇంగ్లీష్, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువులను రచించి తెలుగు నేర్చుకోవటం సులభతరం చేశారన్నారు. బ్రౌన్ తెలుగులోనే కాక అనేక భాషలలో ప్రావీణ్యం సంపాదించారన్నారు. కోశాధికారి ఆదం షఫీ, ఎం.జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేపు నీటి సంఘం ఎన్నికలు

వేమూరు: వేమూరు మండలంలో 11 నీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు, 1, 2, పెనుమర్రు, పెరవలి, అనంతవరం, వేమూరు, చిలుమూరు, నెలపాడు, పెదరావు, పోతుమర్రు, మూల్పూరు గ్రామాల్లో నీటి సంఘం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత ఉన్నత పాఠశాలల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అయా గ్రామాల్లో వేమూరు మండలంలోని 17 గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉండటం వల్ల 11 నీటి సంఘాల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

యంత్రాలే బెటర్ అంటున్న రైతులు

- మొక్కజొన్నలో సీడ్ డ్రిల్ మిషన్లతో పని సులభతరం
- తద్వారా సమయం, ఖర్చు ఆదా
- కూలీల కొరతకు చెక్

భట్టిప్రోలు: కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాల్లో రైతులు యాంత్రీకరణ వైపు దృష్టి సారిస్తూ, వ్యవసాయ పనులకు యంత్రాలే బెటర్ అంటున్నారు. ఇటీవల సంభవించిన తుపాన్‌లు, వర్షాల కారణంగా వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని వాణిజ్య పంటలు, కూరగాయలు, తమలపాకు తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గత రెండు, మూడు నెలలుగా పంట పొలాల వైపు చూడని రైతులు ఇప్పుడిప్పుడే తక్కువ సమయంలో పంట దిగుబడులు చేతికి అందివచ్చే పంటలను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. అంతేకాక తక్కువ ఖర్చుతో ఆధునిక యంత్రాలను ఉపయోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం లంక గ్రామాల్లో మెట్ట సాగులో భాగంగా మొక్కజొన్న వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు సీడ్ డ్రిల్ మిషన్లను రైతులు ఉపయోగిస్తున్నారు.



సీడ్ డ్రిల్ మిషన్‌తో విత్తనాలు నాటుతున్న కూలీలు

ఎకరాకు గంట నుంచి గంటన్నర

ప్రస్తుతం ఎకరా పొలంలో విత్తనాలు నాటితే కూలీలకు రూ.3 వేలు చెల్లించాల్సి వస్తుంది. అదే ఈ విధానం ద్వారా రూ.1,500 మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. ఒక ఎకరంలో సాధారణ పద్ధతిలో విత్తనాలు నాటేందుకు ఐదుగురు కూలీలు అవసరం కాగా నాలుగు నుంచి ఐదు గంటల సమయం పడుతుంది. అదే ఈ మిషన్ ద్వారా ఎకరాకు ఒక కూలీ గంట నుంచి గంటన్నర సమయంలో విత్తుకోవచ్చు. కూరగాయలు, పత్తి, మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలలోనూ ఈ మిషన్‌తో నాటుకోవచ్చు. గింజ సైజును బట్టి వీల్స్‌ను అమర్చుకుని విత్తనాలు నాటేందుకు వీలుంది. సుమారు కేజీ పైనే విత్తనాలు ఇందులో పడతాయి. పని చేసే వారిని బట్టి ఎకరాకు గంట నుంచి గంటన్నరలో నాటవచ్చు. ఒక మనిషి రోజుకు 3 నుంచి 4 ఎకరాల వరకు నాటవచ్చు. సొంత పొలం ఉన్న వారికి ఈ సీడ్ డ్రిల్ మిషన్ ఎంతగానో ఉపకరిస్తుంది.



సాధారణ పద్ధతిలో విత్తనాలు నాటుతున్న కూలీలు

సీడ్ డ్రిల్ మిషన్ ఉపయోగాలు

- చేతితో ఉపయోగించే ఈ మిషన్ ద్వారా అన్ని రకాల విత్తనాలను తేలికగా విత్తుకోవచ్చు.
- సమయం, ఖర్చు ఆదా అవుతుంది.
- సరైన దూరంలో విత్తనాలు నాటుకోవచ్చు.
- ఒక ఎకరంలో గంట నుంచి గంటన్నరలో నాటుకోవచ్చు.
- మిషన్ ఒకేసారి 12 విత్తనాలు నాటుతుంది.

మొక్కజొన్న సాగుకు సిద్ధమయ్యా



విత్తనాలు నాటేందుకు సీడ్ డ్రిల్ మిషన్ ఎంతగానో దోహదపడుతుంది. ఇటీవల సంభవించిన వరదలు, వర్షాల నేపథ్యంలో నాలుగెకరాల్లో వేసిన పసుపు, కంది పంటలు కృష్ణార్పణమయ్యాయి. రూ.4 లక్షలు నష్టపోయాను. దేవునిపై భారం వేసి మొక్కజొన్న సాగు చేపట్టేందుకు సిద్ధమయ్యాను. సీడ్ డ్రిల్ మిషన్ ద్వారా విత్తనాలను నాటిస్తున్నాను. ఈ మిషన్‌తో సరైన దూరంలో విత్తనం నాటుకునే అవకాశం ఉంది. మిషన్ ఒకేసారి 12 విత్తనాలు నాటుతుంది.

–వేసంగి కిషోర్, రైతు, చింతమోటు(భట్టిప్రోలు)

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. సమస్యల పరిష్కారానికై సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేసి అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని అమలు చెయ్యాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవోను జారీ చేయాలన్నారు. సర్వీసులో మృతి చెందిన వారికి దహన సంస్కారాలకై రూ.20,000 అందించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రీ స్కూల్ బలోపేతం చేయటంతో పాటు ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి. సాధికారత సర్వేలలో అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలన్నారు. సెంటర్ల నిర్వహణకు అమలు చేస్తున్న అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు చెయ్యాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చెయ్యాలన్నారు. మెనూ చార్జీలను పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ కనీసం 3 నెలలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లకు ఉచితంగా గ్యాస్ సరఫరా చెయ్యాలన్నారు. కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్ట్ నాయకులు కె.రత్నకుమారి, టి.నిర్మల జ్యోతి, శివనాగులు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమృతలూరు(భట్టిప్రోలు): అపరిష్కృతంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం.రత్నకుమారి డిమాండ్ చేశారు. గురువారం అమృతలూరు ప్రాజెక్ట్ కమిటీ సీడీపీవో జి.విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, సరీ్వసులో ఉండి మరణించిన వారికి మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు బి.అగస్టీన్ మాట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలగించాలని, సెంటర్ల నిర్వహణకు అమలు చేస్తున్న అన్ని యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. యూనియన్ నాయకులు రాణి, బుల్లెమ్మాయి పాల్గొన్నారు.



సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



సీడీపీవో జి.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

బాపట్ల: అత్యంత వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం గురువారం బాపట్ల పట్టణంలో నిర్వహించారు. తొలుత పాతబస్టాండ్ వద్ద అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం నుంచి కనక తప్పెట్లతో వైభవంగా ఊరేగింపు చేపట్టారు. దేవతామూర్తుల వేషధారణలతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. దేవాలయం కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గురుస్వాములు రమాకాంత్, కొటికం సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్ స్వాములు భక్తులకు ఇరుముడి నియమాలను తెలియజేశారు.

రైతుల కోసం చేస్తున్న ర్యాలీ విజయవంతం చేయాలి

కర్లపాలెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాలలో శుక్రవారం రైతుల సమస్యల పరిష్కారం కొరకు జరగనున్న ర్యాలీ కార్యక్రమాలలో రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, పిట్టలవానిపాలెం మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో కోరారు. రైతులు, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు బాపట్ల జిల్లా కేంద్రానికి వచ్చి ర్యాలీలో పాల్గొనటంతో పాటు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పేద వర్గాలకు అధిక ప్రాధాన్యత



అమర్తలూరు(వేమూరు): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, బోడపాడు, యలవర్రు, పాంచాళవరం గ్రామాలలో గ్రామ పార్టీ కార్యవర్గ కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోడపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గేరా ప్రతాప్, పాంచాళవరం అమిరి రత్నకర్, యలవర్రు అధ్యక్షుడిగా తమలపాకుల ప్రేమయ్య, ప్యాపర్రు దోమశ్రీ హషాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానాని తెలిపారు. శుక్రవారం రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బాపట్ల జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతపత్రం అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోసు, అంబటి రామోహనరావు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నల్లూరు సౌత్ గ్రామంలో గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో దీర్ఘకాలంగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించబడునన్నారు. పొలం పత్రాలలో వివరాలు తప్పుగా నమోదైనా, సర్వే వివరాలు, హద్దులు వంటి ఇతర సమస్యలు ఈ సదస్సుల ద్వారా పరిష్కరించటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 32 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురికి 1బీ కాపీలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనా శ్రీను, ఆర్‌ఐ రాంబాబు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు
తహసీల్దార్ మెహర్‌కుమార్

పిట్టువారిపాలెం(కర్లపాలెం): భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని పిట్టలవానిపాలెం తహసీల్దార్ మెహర్‌కుమార్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మెహర్ కుమార్ మాట్లాడుతూ పిట్టువారిపాలెంలో రైతుల నుంచి మంచి స్పందన వచ్చిందని వివిధ సమస్యలపై 20 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏట్ర అశ్వనీరెడ్డి, డీఎల్‌డీవో సవార్త, వీఆర్వో గోవర్ధని, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కాపీని అర్జీదారునికి అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



అర్జీలు తీసుకుంటున్న పీవీపాలెం తహసీల్దార్ మెహర్‌కుమార్

కర్లపాలెంలో...

కర్లపాలెం మండలంలోని బోలాయపాలెం, నాగరాజుపాలెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సదస్సులలో తహసీల్దార్ సుందరమ్మ పాల్గొని భూ సమస్యల పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ రెండు గ్రామాలలో మొత్తం 10 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేంద్ర, వీఆర్వో పోతురాజు, సర్వేయర్ శ్రీరామచంద్రమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఖాళీగా తహసీల్దారు కార్యాలయం

వేమూరు: రైతులకు, ప్రజలకు సేవలు అందించే కార్యాలయంలో అధికారులు లేక పోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వేమూరు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు, ఆర్‌ఐ, క్లర్కు, సర్వేయర్ పని చేస్తారు. గురువారం తహసీల్దారు కార్యాలయం సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉంది. దీంతో వివిధ పనులపై వచ్చిన వారు తిరిగి వెళ్లిపోయారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. అధికారులందరు అందుబాటులో ఉండాలని ప్రజలు కోరుతున్నారు.



లో లెవల్ వంతెన నుంచి ట్రాక్టర్ బోల్తా



కొల్లూరు : ఇసుక రవాణా కోసం వెళుతున్న ఖాళీ ట్రాక్టర్ అదుపు తప్పి చినరేవులోకి బోల్తా కొట్టిన ఘటన మండలంలోని దోనేపూడి కరకట్ట దిగువన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు గురువారం పొన్నూరు ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ ఇసుక రవాణా కోసం గాజుల్లంక కృష్ణా నదికి వెళుతుంది. దోనేపూడి కరకట్ట దిగిన అనంతరం చినరేవుపై ఉన్న ఒక వాహనం ప్రయాణించడానికి మాత్రమే వీలుండే లో లెవల్ వంతెనపై ఎదురుగా వచ్చిన లారీని తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి కృష్ణా నదీపాయ అయిన చినరేవులోకి పల్టీ కొట్టింది. ట్రాక్టర్ వంతెన పై నుంచి కిందకు ఒరిగిపోతుండటంతో ప్రమాదాన్ని పసిగట్టిన ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి కిందకు దూకేయడంతో తృటిలో ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడగలిగాడు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

వేమూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వేమూరు: రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించి కలెక్టరుకు వినత పత్రం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి రైతులు అధిక సంఖ్యలో కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన కోరారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్కులను గురువారం ఆయన పరిశీలించారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయాలని ఇంజనీరింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జమ్ములపాలెం రోడ్డులోని కబేళాను పరిశీలించి, కబేళా రోడ్డును మరమ్మతులు చేయించటంతో పాటు చుట్టూ ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. సరస్వతి మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన డ్రైనేజీలను పరిశీలించి మురుగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డి.ప్రసాద్, కరుణ, డి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ లలితకుమారి

భట్టిప్రోలు: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశం (ఐసీడీజీ)పై మొదటి బ్యాచ్‌కు గ్రామ పంచాయతీ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెటర్నరీ, డిజిటల్, హార్టీకల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు పంచాయతీలకు రూ.కోటి చొప్పున నగదు అవార్డులు వచ్చాయని, మన మండలంలో కూడా ఆ దిశగా అవార్డులు సాధించేలా కృషి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి మాట్లాడుతూ మండలంలో ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం సమస్య నెలకొందని, మౌలిక వసతుల పరిష్కారం కోసం అందరికి ఉపయోగపడే అంశాలను ఎంచుకుని ప్రజలకు మేలు చేయాలన్నారు. ఎంపీడీవో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయంలో అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో ఉన్నారని చెప్పారు. ప్రణాళికల తయారీ, సర్వేలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తెలిపారు. 9 రకాల థీమ్స్‌పై, పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను మాస్టర్ ట్రైనర్లు ఎ.చిన వెంకటేష్‌బాబు, వక్కలగడ్డ సురేష్‌బాబు, వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి సీహెచ్ రామలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ టి.ఊహారాణి పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, గాంధీ చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు.



ఐసీడీజీపై శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి

గ్రామ సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలి

కర్లపాలెం: గ్రామ పంచయతీల సుస్థిరాభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులు కలసి కృషి చేయాలని ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, గ్రామ, మండల స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు అనే అంశంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు పరిశుభ్రమైన గ్రామాలను రూపొందించుకోవాలన్నారు. సామాజిక న్యాయం, పౌరుల భద్రతతో పాటు మౌలిక వసతులు కల్పించటంపై అధికారులు, సర్పంచ్‌లు దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధన అంశాలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రెండు విడతలుగా నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు కావలసిన మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, పశు వైద్యాధికారి రేచల్ దివ్య, సర్పంచ్‌లు గ్రామ పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



కర్లపాలెంలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

మాలల మహాగర్జనను జయప్రదం చేయాలి

జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ

రేపల్లె రూరల్: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీల వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆర్టికల్ 341ను పరిరక్షించాలని కోరుతూ ఈ నెల 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు జిల్లా నల్లపాడులో నిర్వహించే మాలల మహాగర్జన సభలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ సభ్యులతో కలిసి వాల్‌పోస్టర్‌లను విడుదల చేసి మాట్లాడారు. మాలల ఐక్యత–ఆత్మగౌరవం నినాదంతో లక్షలాదిమంది మాలలతో జాతి సమైక్యత కోసం ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు మాల ఉద్యోగులు, విద్యార్థులు, యువత రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు అతీతంగా తరలిరావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉపకులాల వారీగా వర్గీకరించి క్రిమిలేయర్‌ను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దళితుల రాజ్యాధికారానికి గొడ్డలిపెట్టుగా పరిగణించి జై భీమ్‌రావ్ భారత్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబురావు, మాల సంఘాల ప్రతినిధులు చెరుకూరి లక్ష్మణరావు, వాగోలు రమేష్ బాబు, నీలా వాసుబాబు, రాంబాబు, నెరుసు వెంకటరావు పాల్గొన్నారు.



పోస్టర్‌లను విడుదల చేస్తున్న జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: భట్టిప్రోలు పట్టణ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ ఏఈ ఎం.శాంతకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టిప్రోలులో మెయింటినెన్స్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.